# ఆదర్శం

పెళ్లి చూపులు జరుగుతున్నాయి.

అబ్బాయి బంధువులు, అమ్మాయి చుట్టాలు అంతా కలిసి సుమారు పాతిక వరకూ వున్నారు.

అబ్బాయి టీచర్. అమ్మాయి డిగ్రీ పాసయ్యింది.

అబ్బాయి సబ్జెక్ట్ మ్యాథ్స్. పైగా ఎమ్మెస్సీ పూర్తయింది. సో, ప్రమోషన్ కూడా వచ్చేస్తుందని మధ్యవర్తులన్నారు.

కుర్రాడు స్వతహాగా తెలివైన వాడవడంతో ట్యూషన్స్ మెయింటెనెన్స్ చేస్తున్నాడు. కాబట్టి అతగాడికి మంచి ఫ్యూచర్ కూడా వుందని చెప్పారు.

సంబంధం ఖాయమైతే బావుండునని అమ్మాయి తల్లిదండ్రులనుకున్నారు.

అమ్మాయి కుందనపు బొమ్మలా వుంది. మంచి రంగు, ఒక్కసారి చూస్తే

చాలు, ముఖం తిప్పుకోలేని అందం.

కొత్తాపాతా బిడియం లేకుండా అందరితోనూ గలగలా మాట్లాడేస్తోంది. పెళ్లి కుదిరితే జంట చూడముచ్చటగా వుంటుందని అందరూ అనుకున్నారు.

పరిచయాలు, పలకరింపులు, ఫలహారాలు వగైరాలన్నీ సాంప్రదాయ బద్ధంగా, సంతోషకర వాతావరణంలో పూర్తయ్యాయి. అమ్మాయి నచ్చిందని అబ్బాయి అనేయడమే మిగిలివుంది.

అందుకని ఇరువర్గాల బంధుమిత్ర సపరివారమంతా అబ్బాయి నోటి నుండి వెలువడే ఆ 'మంచిమాట' కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

"మీరు ఏమీ అనుకోనంటే, ఓ చిన్న రిక్వెస్ట్" అమ్మాయి తండ్రివైపు తిరిగి అన్నాడు అబ్బాయి.

అది విని అమ్మాయి అందమైన కనుబొమ్మలు ముడివడ్డాయి ప్రశ్నార్థకంగా... అతనేం అడుగుతాడోనని!

అబ్బాయి అడగడమాలస్యం, వధువు తండ్రి-

"ఎంతమాట! చెప్పండి బాబూ. మీరు రిక్వెస్ట్ చేయడమేంటి?" అన్నాడు నొచ్చుకుంటూ.

"మీ కూతురుతో పర్సనల్‌గా మాట్లాడాలి..." నసిగాడు మొహమాట పడుతున్నట్లు.

"ఓస్ ఇంతేనా! అమ్మాయి, అబ్బాయి ఏకాంతంగా మాట్లాడుకోవడం ఈ రోజుల్లో సహజమే కదా!" అని ఊపిరి పీల్చుకున్నారు ఆడపిల్ల తరపు వాళ్లు.

"దాందేముంది బాబూ! అలాగే కానివ్వండి" అన్నాడా ఆడపిల్ల తండ్రి ఎంతో వినయంగా.

అందుకు ఏర్పాట్లు కూడా చకచకా జరిగిపోయాయి.

ఏకాంతం దొరికేటట్లు అబ్బాయిని, అమ్మాయిని ఇంటివెనకాల పెరట్లోని జామచెట్ల చెంతకు పంపించారు.

అక్కడ కాబోయే భాగస్వామితో అబ్బాయి మనసు విప్పి మాట్లాడాడు. తన అభిప్రాయాల్ని, అభిరుచుల్ని, ఆలోచనల్ని ఆమె ముందుంచాడు. ఫైనల్‌గా ఆమెని చేసుకోవడానికి తనకెలాంటి అభ్యంతరమూ లేదని ప్రకటించాడు.

అతని మాటల్లోని నిజాయితీ నచ్చిందామెకు.

పెళ్లి చూపులనగానే అమ్మాయిల్ని గుచ్చి గుచ్చి ప్రశ్నించే మగమహారాజులున్న ఈ కాలంలో అందుకు విరుద్ధంగా తన స్వభావాన్ని మాత్రమే ఆమెకి వివరించిన ఆ అబ్బాయి తత్వం, అమ్మాయి పట్ల అతనికున్న గౌరవం ఆమెనెంతో ఆకట్టుకున్నాయి. చాలా సంతోషపడింది.

అందుకని నిర్మొహమాటంగా తన మనోభావాల్ని కూడా వెల్లడించింది.

చివరగా అబ్బాయిని ప్రశ్నించిందిలా-

"కట్నం ఎంత అడగాలనుకుంటున్నారు?" అని

చిరునవ్వు నవ్వాడతను.

ఆమె కట్నం ప్రసక్తి ఎందుకు తెచ్చిందో అర్థమైందతనికి. ఇన్ని ఆదర్శభావాలున్నవాడు కట్నం ఎందుకు ఆశిస్తున్నాడని ఆమె ఆలోచన కాబోలు' అని మనసులో అనుకున్నాడు.

పైకి మాత్రం -

"అబ్బే! అలాంటి ఆలోచనే లేదండీ. మావాళ్ళు అందరి ముందు ముందే చెప్పారుగా, అమ్మానాన్నలకు నేనొక్కడ్నే కొడుకునని, ఉన్న ఒక్క సిస్టర్ పెళ్ళయిపోయిందని. నాకు ఉద్యోగం వుంది. పైగా వెనక ఎంతో కొంత ఆస్తిపాస్తులున్నాయి. మీరు కట్నంతో మా ఇంట్లోకి కోడలిగా అడుగిడితేనే మాకు గడుస్తుందని లేదు.

**నేను కట్నాలకి వ్యతిరేకిని కూడా. కట్నకానుకల పద్ధతి నాకు నచ్చదు. ఆదర్శ వాదినిగా! అందుకని" అన్నాడు నవ్వుతూ.**

"వ్వాట్! కట్నం వద్దా?" బోల్డు ఆశ్చర్యపోయింది.

కాస్త గర్వంగా ఫీలయ్యాడతను.

"మా వాళ్లు రెండు లక్షల క్యాష్ ప్లస్ బైక్ కట్నకానుకలుగా ఇవ్వడానికి రెడీగా వున్నారు. మీరు కట్నం వద్దంటే ఎలా?" అంది మళ్లీ.

ఈసారి ఆశ్చర్యపోవడం అతని వంతయ్యింది. ఆమె ఎందుకలా అందో అర్థం కాలేదతనికి.

**"ఆదర్శాలు మంచివే, కాదనను. కానీ అన్నివేళలా పనికిరాదు కట్నం అడగడంలో తప్పగానీ, ఇచ్చినప్పుడు తీసుకోవడంలో తప్పేం లేదు.**

ఇక ఈ విషయంలోనే మన మధ్య అభిప్రాయభేదాలు మొదలు కావచ్చు. అలాంటప్పుడు భవిష్యత్‌లో ఎలా వుంటుందో?

మూరేళ్లూ కాపురం చేయాల్సిన వాళ్ళం. మీ ఆదర్శాలు కలహాల్ని సృష్టించొచ్చు. అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను" అంది.

ఊపిరి పీల్చుకోవడానికి ఒక్క క్షణం ఆగింది.

విస్మయంగా చూసాడామె వంక.

"మావాళ్లిస్తామన్నవి నా పేరున ఇచ్చేయమని అడగండి" అంది నిష్కర్షగా.

షాక్ కొట్టినట్టు నిలబడిపోయాడతను.

**(13.12.2001)**

*